రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.19, వంకాయ రూ.35, బెండ రూ.21, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.25, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.55, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.35, అర్వి రూ.37, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.65. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పేదల ప్రాణదాత సత్య శ్రీనివాస్



శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సామ రమణారెడ్డి

చంపాపేట: అనారోగ్యంతో బాధపడుతున్న పేదవారికి నిస్వార్థంగా కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్య సేవలు అందించిన ప్రాణదాత దివంగత వైద్య నిపుణులు భండారు సత్యశ్రీనివాస్ అని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి కొనియాడారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎస్‌జీఆర్ కాలనీలో రోహిణి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ఆయన హాజరై శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, మెట్టు సంజీవరెడ్డి, నర్సింహాచారి, ఆనందరెడ్డి, శంకర్‌రెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

నేడు ప్రత్యంగిరా దేవికి లక్ష గాజుల పూజ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవార్లకు శ్రావణ పౌర్ణమి సందర్భంగా లక్ష గాజుల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

కొనసాగుతున్న నాటిక పోటీలు



శ్రీ రామభక్త హనుమాన్ నాటకంలోని ఓ సన్నివేశం

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై కొనసాగుతున్న నవమఆహ్వాన పౌరాణిక పద్యనాటిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. మూడోరోజు శనివారం రాత్రి కూకట్‌పల్లికి చెందిన ఏపీటీఎం వారు శ్రీరామభక్త హనుమాన్, నిజాంపేటకు చెందిన శ్రీ రామకృష్ణా నాట్యమండలి వారు శ్రీకృష్ణాంజనేయ యుద్ధం నాటికలను ప్రేక్షకులను మైమరిపించాయి. ఈ కార్యక్రమంలో సమాఖ్య కన్వీనర్ వీవీ.సుబ్బారావు, పంపన వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సోమయాజులు, సూర్యనారాయణ, అచ్యుత రామయ్య, పుండరీకాక్షుడు, సూర్యప్రకాష్, జైపాల్‌రెడ్డి, బుగ్గయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నగరంలోని పురానాపూల్ ఆర్యవైశ్య భవనం నిర్మాణానికి, చారిటబుల్ ట్రస్ట్‌కి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆదివారం తన నివాసంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సదానంద గుప్తా, యాడ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చింతల్‌బస్తీలో ఘనంగా బోనాలు



జంగం మధుకర్‌రెడ్డిని సన్మానిస్తున్న బస్తీవాసులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ చింతల్‌బస్తీలో ఆదివారం శ్రావణ మాస బోనాలను ఘనంగా నిర్వహించారు. బస్తీలోని అమ్మవారి దేవాలయానికి తెల్లవారుజాము నుంచే మహిళా భక్తులు పెద్దసంఖ్యలో బోనాలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బస్తీవాసులు ఆయనను శాలువాతో సన్మానించారు. బస్తీవాసులు నాగరాజు, సంతోష్, చిన్న, రాము, శివ, సంపత్ పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు..

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఎస్సైలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది, అధికారులకు ఆదివారం ఉప్పల్ భగాయత్‌లోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం బాధ్యతాయుతంగా నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు పెంచుకున్న అధికారులను ప్రజల ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. కమ్యూనిటీ పోలీస్ వ్యవస్థను మెరుగుపరచడానికి అధికారులు చేసిన కృషిని ఏసీపీ ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం బదిలీపై వెళ్లిన పోలీసులు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి పాల్గొన్నారు.



సత్కార కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ చక్రపాణి

బండి రాదు.. చెత్త తరలదు!

ఎల్‌బీనగర్ పరిధిలో పేరుకుపోతున్న వ్యర్థాలు • పట్టించుకోని అధికారులు

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో చెత్త తరలింపులో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్తీలు, కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ దుర్గంధంగా మారి దుర్వాసన వస్తోందని కాలనీలవాసులు వాపోతున్నారు. చెత్త సేకరించే ఆటోవాలాలు ఇళ్ల వద్దకు సరిగ్గా వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.

–ఎల్‌బీనగర్



ఎల్‌బీనగర్‌లోని ఓ కాలనీలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

ఇంటింటికి వెళ్లే ఆటోలు, చెత్తను సేకరించే స్వచ్ఛ వాహనాలు సరిగా కాలనీలకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు చెత్త ఆటోల నిర్వాహకులు వ్యక్తిగత పనుల కోసం దూరంగా ఉండడం, మరి కొన్ని ఆటోలు సేకరణకు రాకుండా డుమ్మా కొట్టడం వంటివి జరుగుతున్నాయి. మరి కొన్ని ఆటోలు మాత్రం రోజు వారీగా చెత్త సేకరణలో నిమగ్నమయ్యారు. క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేసే డ్రైవర్లను కిందిస్థాయి అధికారులు గుర్తించి సత్కరించాలని గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించినప్పటికి క్షేత్రస్థాయిలో అవి జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎటు చూసినా చెత్త కుప్పలే..

ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో వెయ్యికి పైగా కాలనీలో ఉంటాయి. ఈ కాలనీలో రోజుకు సుమారు 400 టన్నుల మేర చెత్త పోగవుతోంది. చెత్త సేకరణ సరిగా లేకపోవడంతో కాలనీలో చెత్త పేరుకుపోతుంది.ఈ చెత్త సేకరణ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంతో చెత్త సేకరణ గాడి తప్పుతోంది. ఉదయం వేళలోనే చెత్తను సేకరించాలని అధికారులు సూచించడంతో ఇళ్లలో చెత్తను రోడ్ల పైకి వేసేవారు, తోపుడు బండ్ల నిర్వాహకులు, హోటళ్లు, సంచార సంతలు వలన రోజుకు అదనంగా చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను సేకరించకపోవడంతో అడ్డదారిని రోడ్ల వెంబడి, కాలనీలో పడేయడంతో అదనంగా 100 నుంచి 150 కుప్పల వరకు చెత్త పేరుకుపోతుంది.ఈ చెత్త సేకరణకు రోజువారీగా డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఫీల్డ్ సహకుల పర్యవేక్షణ మొక్కుబడిగా సాగుతోందని విమర్శలు వస్తున్నాయి.



ఆటోలు, చెత్త సేకరణ వివరాలు

ఎల్‌బీనగర్ సర్కిల్–3లో చెత్త సేకరించే ఆటోలు 150
సర్కిల్–4లో 161
సర్కిల్–5లో 175

సర్కిల్–3లో ఇంటింటికి వచ్చి సేకరించే చెత్త 182 టన్నులు
సర్కిల్–4లో 161 టన్నులు
సర్కిల్–5 170 టన్నులు
రోజూ డిమ్మాకొట్టే ఆటోలు సుమారుగా 20 నుంచి 40 వరకు ఉంటాయి.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సామాజికవేత్త పాటూరు వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రలేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు వెంకటేశ్వర్లు సహకారంతో మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..అనాథ విద్యార్థులను అక్కున చేర్చుకొని, వారికి భోజన, వసతి, అన్ని విద్యా సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్ అనాథ విద్యార్థి గృహం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. హాస్పిటల్ మేనేజర్ మహేందర్ మాట్లాడుతూ.. కొందరు విద్యార్థులకు కంటి చూపు సమస్యలు ఉన్నాయని, వారికి కొన్ని పరీక్షలు అవసరమని కొత్తపేటలోని మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తారన్నారు. 115 విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆప్తలామిస్ట్ హిమబిందు, సిబ్బంది శ్రీలేఖ, హామీన్ పాల్గొన్నారు.

తాను మరణించినా ముగ్గురి జీవితాల్లో వెలుగులు



కాంతబెన్ పటేల్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో ఓ గృహిణి వెలుగులు నింపారు. జీవన్‌దాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. ఎల్‌బీ నగర్ శాతవాహననగర్‌కాలనీకి చెందిన కాంతబెన్ పటేల్ (55) ఈ నెల 16న ఇంట్లో అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించగా ఎమర్జెన్సీ వార్డులో ఉంచి చికిత్స అందించారు. మరోసటి రోజు చికిత్సకు ఆమె స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు కాంతబెన్‌పటేల్ భర్త ఇద్దరు కుమారులకు అవయవదానంపై అవగహన కల్పించగా వారి అంగీకారంతో కాంతబెన్ పటేల్ రెండు కిడ్నీలు, లివర్‌ను దానం చేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నాగోలు: కొత్తపేటలో డివిజన్‌లోని శ్రీవైష్ణవి నగర్ కాలనీ నల్ల పోచమ్మ నూతన ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయకులు తోట నందు యాదవ్, రాహుల్ యాదవ్, సంపత్ యాదవ్, తోట మహేందర్ యాదవ్, నాయకులు కొత్త తిరుమల, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా మార్కండేయ రథయాత్ర

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో పద్మశాలీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ భక్త మార్కండేయస్వామి రథయాత్ర ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో గత ఆరేళ్ల నుంచి ఈ రథయాత్ర నిర్వహిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు. పద్మశాలీ సంఘ భవనం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం వరకు కొనసాగింది. సోమవారం ఉదయం యజ్ఞోపవిత కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నియామకం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని వీరాంజనేయ భక్త సమాజం (గణేశ్ ఉత్సవ సమితి) సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామపెద్దల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయ భక్త సమాజం నూతన అధ్యక్షుడిగా సామ బాబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, ప్రభాకర్, కర్రె లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా లాలా సందీప్, జాయింట్ సెక్రటరీలుగా బంగారు రాహుల్, సామ సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా బి.జగదీశ్వర్ రాజు, కార్యవర్గ సభ్యులుగా మోర యాదగిరి, మరాఠి శివకుమార్, బి.బీమా, పి.మధూకర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, ఆశంగారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాఖీలకు భలే గిరాకీ!

- నేడు రక్షాబంధన్
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన రాఖీ విక్రయ కేంద్రాలు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాఖీ కడుతున్న కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్

దిల్‌సుఖ్‌నగర్: అన్నా, చెల్లెళ్ల అనుబంధం, ఆత్మీయతను చాటి చెప్పే 'రక్షాబంధన్' (రాఖీ పౌర్ణమి) పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మలక్‌పేటజోన్ పరిధిలో వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు రక్షాబంధన్ కార్యక్రమాలు నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, ఐఎస్‌సదన్, మాదన్నపేట్ పరిధిలోని కాలనీలు, ప్రధాన చౌరస్తాలు, బస్తీలలో రాఖీల విక్రయ కేంద్రాలకు గిరాకీ పెరిగింది. ఎక్కడ చూసిన రాఖీల కొనుగోలుదారులతో ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, మలక్‌పేటలోని ప్రధాన వస్త్ర దుకాణాలు, మాల్స్ సైతం కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. జోన్ పరిధిలోని చిన్న పెద్ద షాపులతో సంబంధం లేకుండా అని రాఖీ షాపులు కొనుగోలు చేస్తున్న వారితో సందడిగా మారాయి. గత సంవత్సరంతో పోల్చితో రాఖీల ధరలు పెరిగిన కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. ఆడపడుచులకు ఎంతో ఇష్టమైన పండుగ కావడంతో తమకు నచ్చిన రాఖీలను ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లలో వివిధ రకాలు, రంగురంగుల రాఖీలను అందుబాటులో ఉంచారు.

ఉప్పల్ శిల్పారామంలో..

నాగోలు: ఉప్పల్ శిల్పారామంలో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గుర్తు రాఖీ పండుగ అని నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న రకరకాల రాఖీలు

సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

మన్సూరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం అంబాల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వీరస్వామిగౌడ్, పల్లే గణేష్‌గౌడ్, కొత్త వెంకటేష్‌గౌడ్, వెంకటరమణగౌడ్ పాల్గొన్నారు.

సాహెబ్‌నగర్ చౌరస్తాలో..

చంపాపేట: మడమ తిప్పని పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీఎన్‌రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్ అన్నారు. ఆదివారం పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు. మహేష్‌గౌడ్, అశోక్, మహేష్, కృష్ణ, నాగరాజు, శ్రీకాంత్, కొండయ్య, యాదగిరి, రవీందర్, విజయప్రకాష్, దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఆదివారం వనస్థలిపురంలో సీనియర్ సిటిజెన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, పలువురు నాయకులు హాజరై సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలయాన్ని తీర్థస్థలంగా తీర్చిదిద్దాలి

మంత్రి కొండా సురేఖ



మంత్రిని కలిసిన నల్లా రఘుమారెడ్డి, ఈఓ లావణ్య

చంపాపేట: ఏడున్నర శతాబ్దాల చరిత్ర గల కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయాన్ని ప్రముఖ తీర్థస్థలంగా తీర్చిదిద్దేందుకు ఆలయ పాలక మండలి సభ్యులు, ఈఓ, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆదివారం ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఈఓ లావణ్య ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీని వేర్వేరుగా కలిసి ఆలయంలో దాతల సహకారంతో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఛాతిరి మధుసూదన్‌సాగర్, బబ్బూరి ఆనంద్ కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, గూడూరు మధుసూధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శైలజ, అలయ అర్చకులు చంద్రకాంత్, తిరుమలేష్, యాదగిరి, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.



గిరిజన సంస్కృతిని చాటి చెప్పేది తీజ్ వేడుక



తీజ్ వేడుకల్లో పాల్గొన్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

దిల్‌సుఖ్‌నగర్: గిరిజన సంస్కృతిని చాటి చెప్పేదే తీజ్ వేడుక అని బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ పేర్కొన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఆదివారం బంజారాల తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజార సంస్కృతి సంప్రదాయాలను రక్షించడంతోపాటు, ప్రజలు ప్రకృతి పచ్చదనంతో కళకళలాడుతూ ఎప్పుడు పచ్చగా హరిత భరితంగా ఉండాలని తీజ్ పండుగ నిర్వహిస్తారన్నారు. ఎన్టీఆర్‌నగర్ బంజారా బస్తీలో గుడి పూజారి బాలునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బస్తీ నుంచి ప్రధాన రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నిమజ్జనం కోసం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, జాహీద్, కృష్ణానాయక్, దశరథ నాయక్, శ్రీను నాయక్, శుక్రు నాయక్, దశ్రు నాయక్, రవి నాయక్,కవిత, లక్ష్మీ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



దీక్షలో సంఘీభావం తెలుపుతున్న బీసీ నేతలు

చంపాపేట: స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనకు ముందే రాష్ట్రంలో బీసీ జనగణన చేసి బీసీలకు ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్లు, కుల జనగణన తదితర డిమాండ్‌లతో ఆదివారం హస్తినాపురం డివిజన్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బీసీల పోరు దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీల పోరుకు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య కూడా తమకు సంఘీభావం తెలిపినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రామ్మూర్తిగౌడ్, వాసుదేవ్, రాజారామ్, కరుణాకర్, సిద్దేశ్వర్, రఘురాం, సతీష్‌గౌడ్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365